క్లుప్తంగా

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి



తొర్రూరు: బ్యాంకు సేవలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వర్లు అన్నారు. డివిజన్ కేంద్రంలోని 14వ వార్డులో సోమవారం భద్రాద్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 19వ బ్రాంచ్‌ను ఆయన ప్రారంభించారు. బ్యాంకు రూ.930 కోట్లతో వ్యాపారం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ దాసరి వేణుగోపాల్, డైరెక్టర్లు దేవత రాజారావు, మద్ది పిచ్చయ్య, వైస్ చైర్మన్ ఉదయ ప్రతాప్, వేములపల్లి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అనాథ మిత్రుడికి అండగా..



గూడూరు: మండల కేంద్రంలో అద్దె గృహంలో ఉంటూ, ఆటో నడుపుతూ జీవనం గడుపుతున్న ఓ అనాథ యువకుడు మరో అనాథ యువతిని పెళ్లి చేసుకోగా, అతడి బాల్యమిత్రులు ఆర్థికసాయం అందించి అండగా నిలిచిన సంఘటన సోమవారం జరిగింది. వివరాల ప్రకారం మండలంలోని దామరవంచకు చెందిన నల్లగొండ అనిల్, బయ్యారం మండలానికి చెందిన అనాథ అయిన గాయత్రితో పెళ్లి కుదిరింది. బాల్యమిత్రులు అనిల్ పెళ్లి రిసెప్షన్‌లో రూ.68వేల ఆర్థిక సహాయం అందించారు.

రవాణా ఖర్చుల అందజేత

కురవి: సీరోలు మండల కేంద్రంతోపాటు కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు రవాణా ఖర్చులను రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తేజావత్ రాంచంద్రునాయక్ ఇవ్వగా, అతని సోదరుడు తేజావత్ రాంకిషన్ నాయక్ చేతులమీదుగా సోమవారం రూ.31,850 నగదును పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు అరుణశ్రీ, బంగారి, వెంకన్న, కేలోత్ అర్జున్ చౌహాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయాలి

నెల్లికుదురు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని ప్రయోజకులను చేసే బాధ్యత గురువులపైనే ఉందని ఎస్సై చిర్ర రమేష్ బాబు అన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో సోమవారం వీడ్కోలు, వార్షికోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఉపేందర్, ఎంఈఓ రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్మానం

డోర్నకల్: మండలంలోని బొడ్రాయితండాకు చెందిన గ్రూప్–2 విజేత అజ్మీర శ్రీకాంత్‌ను సోమవారం తండావాసులు ఘనంగా సన్మానించారు. 553వ ర్యాంక్ సాధించి ప్రతిభ కనబర్చాడు. తండాలో శ్రీకాంత్‌తోపాటు ఆయన తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తేజావత్ గమ్మి, తేజావత్ రాజు, తేజావత్ భాస్కర్, భాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మరిపెడ రూరల్: మండలంలోని లక్ష్మాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని జామ్లాతండాలో సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు బానోతు అనిల్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు కర్ణ, కిషన్, జగ్న, మల్సూర్, పాపాలాల్, వెంకన్న, వీరన్న, మంగ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

డోర్నకల్: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన డోర్నకల్ మండలం గుర్రాలకుంటలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నూనావత్ సరు(40), రాములు దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. సోమవారం దంపతులు కూలీ పనులకు వెళ్లి ఇంటికి వచ్చారు. అనంతరం సరు ఫ్యాన్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. సిమెంట్ రేకుల కింద ఇనుప రాడ్‌కు అమర్చిన ఫ్యాన్‌కు విద్యుత్ వైరు తగిలింది. ఈ ఫ్యాన్ రాడ్‌కు ఇనుప తీగ కట్టి దానిని దండెలా వాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఇనుప తీగకు విద్యుత్ సరఫరా అయ్యింది. దండెంపై దుస్తులు ఆరేస్తున్న సరుకు షాక్ తగిలింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది.

పరీక్ష సామగ్రి పంపిణీ

మహబూబాబాద్ రూరల్: మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు తెలుగు సమితి ఆఫ్ నెబ్రాస్కా (యూఎస్ఏ) వారి సహకారంతో స్ఫూర్తి ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్ బాబు, రామసహాయం శ్రీధర్ రెడ్డి, కృష్ణయ్య, నెలకుర్తి ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తాలు..

- సమయానికి రోగులను, గర్భిణులను ఆస్పత్రికి చేర్చడంలో 108, 102 వాహనాల కీలకపాత్ర



గూడూరులోని 108 అంబులెన్స్ వాహనం

గూడూరు: అత్యవసర వైద్య సేవలు అందించడంలో 108, 102 అంబులెన్స్ వాహనాలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని ప్రభుత్వ ఆస్పత్రులకు చేరవేయడంలో కీలకంగా నిలుస్తున్నాయి. దివంగత వైఎస్. రాజశేఖరరెడ్డి పాలనలో ఈ వాహనాల సేవలు ప్రారంభమయ్యాయి. మహబూబాబాద్ జిల్లాలో ప్రస్తుతం 108 వాహనాలు 19 ఉన్నాయి. 1 నియోనేటల్ అంబులెన్స్ వాహనం ద్వారా విస్తృతంగా సేవలు అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది జనవరి నుంచి డిసెంబర్ వరకు 108 వాహనాల ద్వారా 17,592 మంది అత్యవసర సేవలు పొందారు. ఈవాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డ్రైవర్ ఉంటారు. ఫోన్ రాగానే వాహనాలు సంబంధిత అస్పత్రుల వద్ద అందుబాటులో ఉంచుతారు. 15నిమిషాల్లో ఘటనాస్థలికి చేరి సేవలు అందిస్తారు. గత ఏడాది జిల్లాలో 21 మంది గర్భిణులకు వాహనంలో ప్రసవం చేసి, తర్వాత సమీప ఆస్పత్రులకు చేర్పించారు.



108 వాహనంలో ప్రసవం చేసిన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఫైల్)

శిశు మరణాల రేటు తగ్గింది



అత్యాధునిక పరికరాలతో నియోనేటల్ వాహనం రూపొందించారు. వాహనం వచ్చాక జిల్లాలో శిశు మరణాల రేటు తగ్గింది. అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారులను సకాలంలో ఆస్పత్రులకు తరలించి సేవలందించడమే వాహనాల లక్ష్యం. సిబ్బంది నిరంతరంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

– బత్తిని మహేష్‌గౌడ్, ప్రోగ్రాం మేనేజర్, మహబూబాబాద్

102 ద్వారా..

ప్రభుత్వం 102 వాహనాలను ప్రవేశపెట్టిన తరువాత గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. ఈ వాహనాలు అందుబాటులోకి వచ్చాక ఆస్పత్రులకు వెళ్లి వచ్చేందుకు రవాణా ఇక్కట్లు తీరాయి. గర్భం దాల్చిన మహిళల పేర్లు నమోదు చేసుకొని సమయానుగుణంగా ఆశ, ఏఎన్ఎంలు 102 వాహనంలో తీసుకెళ్తారు. జిల్లాలో ఇప్పటి వరకు 16,797 మంది గర్భిణులు సేవలు పొందారు. జిల్లాలో 102 వాహనాలు బయ్యారం, మహబూబాబాద్, కొత్తగూడ, గంగారం, తొర్రూర్, నెల్లికుదురు, మరిపెడ మండలాల్లో పనిచేస్తున్నాయి.

పంటలకు నీరందేలా కృషి చేస్తాం..



దంతాలపల్లి: కాల్వ భూమిని పరిశీలిస్తున్న డీఈ

దంతాలపల్లి: వేసవి పంటలు పూర్తి కాగానే కాల్వ పనులు ప్రారంభిస్తామని ఇరిగేషన్ డీఈ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని రామవరం గ్రామ చెరువులోకి సాగునీటిని అందించే కాల్వ భూములను సోమవారం డీఈ పరిశీలించి కాల్వ భూములకు హద్దులు ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 60డీబీఎం కాల్వ ద్వారా రామవరం గ్రామానికి నీళ్లు అందించేందుకు ఉపయోగపడే 9ఆర్ మైనర్ కాల్వ కొన్ని సంవత్సరాల నుంచి కొంతమంది రైతులు కాల్వ పూర్తి చేయకుండా అడ్డుపడుతున్నారని గుర్తుచేశారు. మండలంలోని దొనకొండ గ్రామంలో రైతుల పంట పొలాలను డీఈ రాజ్‌కుమార్, తహసీల్దారు రాజేశ్వర్‌తో కలిసి పరిశీలించారు. పంటలకు నీరు ఇచ్చేలా కృషిచేస్తాం అన్నారు. కార్యక్రమంలో ఏఈ వాహిని, ఆర్ఐ నాజీముద్దీన్ సర్వేయర్ నిత్యాశ్రీ, ఇరిగేషన్ ఏఈ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు

మహబూబాబాద్ రూరల్: రైతులు, ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భగవాన్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ కల్యాణ్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సాగునీటి కొరతపై మండలస్థాయి కమిటీ సభ్యులు తహసీల్దార్ భగవాన్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఏఈ కల్యాణ్, మండల వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం గ్రామాల్లో పంట కాల్వలను పరిశీలించారు. అదే విధంగా వీఎస్. లక్ష్మీపురం గ్రామంలోని కొత్త చెరువు కట్టను పరిశీలించి, ఎలాంటి ప్రమాదం జరుగకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వల పరిశీలన

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వల్లో నీటి ప్రవాహాన్ని సోమవారం తహసీల్దారు కృష్ణవేణి పరిశీలించారు. చివరి ఆయకట్టు వరకు నీరందించేందుకు కృషి చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మహాధర్నాలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

మహబూబాబాద్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి సంపూర్ణ, స్నేహ బిందు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఆకుల రాజు, కుంట ఉపేందర్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలకు సమస్యలపై పలుమార్లు వినతులు ఆందోళనలు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని జిల్లా కేంద్రాల్లో రాత్రి బస, వంటావార్పు కార్యక్రమం ఉంటుందన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన జాతీయ విధానం మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగన్న, రాజమౌళి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ధర్నా కరపత్రాల ఆవిష్కరణ

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టనున్న కలెక్టరేట్ ధర్నా కార్యక్రమం కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం, మండల అధ్యక్షుడు ముల్క మురళీ మాట్లాడారు. జిల్లాలో 80వేల మంది కార్మికులు సంక్షేమ బోర్డులో సభ్యులుగా చేరారని, ఇందులో 35వేల మంది కార్మికులకు, 2009నుంచి నేటి వరకు రెన్యూవల్ కాకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉప్పలయ్య, రవి, రామ్మూర్తి పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

మహబూబాబాద్ రూరల్: పోలీసుస్టేషన్ పరిధిలో వినియోగిస్తున్న వాహనాలు జాగ్రత్తగా నడిపి ఎప్పుడు మంచిగా ఉండేలా డ్రైవర్లు విధి నిర్వహణ చేయాలని జిల్లా పోలీసు శాఖ మోటారు ట్రాన్స్‌పోర్ట్ అధికారి సోములు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ వాహనాలను ఎంటీఓ సోములు సోమవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 20నుంచి 27వరకు జరగనున్న యూనివర్సిటీల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో సోమవారం యూనివర్సిటీల సమస్యలపై వాల్‌పోస్టర్లను పీడీఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే మనువాద బీజేపీ కుట్రలను వ్యతిరేకిస్తూ ఈనెల 20న శాతవాహన, 26పాలమూరు, 27ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర సదస్సుకు విద్యార్థులు, మేధావులు తరలిరావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నవీన్, సాగర్, విక్రమ్, సందీప్, ప్రవీణ్, శ్రీను, భరత్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థుల వీడ్కోలు



వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మహబూబాబాద్ అర్బన్: పదో తరగతి విద్యార్థులు భవిష్యత్‌తో విజయాలను ఆకాంక్షిస్తూ ఈ వీడ్కోలు సభను ఏర్పాటు చేయడం బాగుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ జిల్లా నాయకుడు శంతన్ రామరాజు అన్నారు. మానుకోట మున్సిపల్ పరిధిలోని శనిగపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పదిలో 10/10 సాధించిన వారికి రూ. 5వేలను అందజేస్తామని శంతన్ రామరాజు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం ధశరథి, ఉపాధ్యాయులు చాగంటి ప్రభాకర్, వెంకన్న, చైతన్య, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆశలకు కనీస వేతనం ఇవ్వాలి



నెహ్రూసెంటర్: వినతిపత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

నెహ్రూసెంటర్: రాష్ట్రంలో పని చేస్తున్న ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని ఆశవర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు పుచ్చకాయల రజిని అన్నారు. ఆశాల సమస్యలు పరిష్కరించాలని డీఎంహెచ్ఓ మురళీధర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్, విజయ, మాధవి పాల్గొన్నారు.

వైద్యాధికారికి ఆశవర్కర్ల వినతి

గూడూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ కార్యాలయంలో సోమవారం మండల ఆశ వర్కర్ల యూనియన్ ప్రతినిధులు అయోధ్యపురం పీహెచ్‌సీ డాక్టర్ యమునకు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మండల ఆశవర్కర్లు ఎం.నళిని, బి.స్వరూప మాట్లాడుతూ.. ఈనెల 17నుంచి చేపట్టే కార్యాచరణ ప్రణాళికలపై ముందస్తుగా మండల పరిధిలోని వైద్యాధికారికి, తహసీల్దార్‌కు అనుమతి కోరుతూ వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.

వేసవిలో నిరంతర విద్యుత్ అందజేస్తాం..

పెద్దవంగర: వేసవిలో అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు జిల్లా చీఫ్ ఇంజనీర్ రాజీవ్ చౌహాన్, సూపరింటెండెంట్ ఇంజనీర్ నరేష్ తెలిపారు. సోమవారం మండలంలోని వడ్డె కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో చేపడుతున్న విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా చేపట్టుతున్న సెపరేట్ బ్రేకర్ చార్జ్ పనులను తొర్రూరు డివిజన్ ఇంజనీర్ మధుసూదన్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి మరమ్మతులు లేవని చెప్పారు. 24 గంటల అంతరాయం లేని విద్యుత్ అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం లైన్‌మన్‌లకు విద్యుత్ కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో డీఈ సునీత, ఏడీఈ చలపతిరావు, ఏఈ రమేష్, సబ్ ఇంజనీర్ నిహాల్‌లు పాల్గొన్నారు.



కిట్‌ను అందజేస్తున్న రాజీవ్ చౌహాన్

క్రైం కార్నర్..

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం



యాకస్వామి (ఫైల్)

గూడూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యుత్ ఉద్యోగి మృతిచెందిన సంఘటన గూడూరు మండలం బొద్దుగొండ శివారు గండి తండా డౌన్‌లో జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాల ప్రకారం తొర్రూరు మండలం పోలెపల్లికి చెందిన తండా యాకస్వామి(40) గూడూరు మండలం భూపతిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రెండు సంవత్సరాల క్రితం బదిలీపై వచ్చిన యాకస్వామి మండల కేంద్రంలో అద్దెకు తీసుకొని భార్య సంధ్య, ఒక కొడుకు, కూతురుతో ఉంటున్నారు. ఆదివారం భార్యా పిల్లలతో మానుకోట సమీప అమనగల్‌లో ఓ ఫంక్షన్‌కు వెళ్లి, ఉదయం విద్యుత్ డివిజన్ కార్యాలయంలో పని ఉండి, భార్య సంధ్యను మరో ఫంక్షన్‌కు పంపించాడు. అక్కడ పని ముగించుకున్న యాకస్వామి సాయంత్రం గూడూరుకు ద్విచక్రవాహనంపై గండితండా వద్దకు చేరుకున్నాడు. వెనకాల నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొని యాకస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సీఐ జి. సూర్యప్రకాష్ మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించారు. ఢీకొట్టిన వాహనం గుర్తు తెలియకపోవడంతో గూడూరు వైపు, మానుకోట వైపు సీసీ కెమెరా ఫుటేజీల్లో గాలిస్తున్నట్లు తెలిసింది.

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మండలంలోని ఉత్తర తండా గ్రామ శివారులో 1.70క్వింటాళ్ల నల్లబెల్లం, 20కిలోల పటిక, 5లీటర్ల గుడుంబా పట్టుబడ్డాయని రూరల్ ఎస్సై వి.దీపిక సోమవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు తండాల్లో తనిఖీలు నిర్వహించామన్నారు. తండాల్లో నిల్వ ఉంచిన నల్లబెల్లం, పటిక, గుడుంబా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సీత్లా తండాకు చెందిన అజ్మీర సురేష్, ఉత్తర తండా జీపీల పరిధిలోని రాయికుంట తండాకు చెందిన భూక్య నర్సింహపై కేసు నమోదు చేశామన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మహబూబాబాద్ రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఈనెల 15వ తేదీ సాయంత్రం పి.సంతోష్ అనే పేరు గల ఒక వ్యక్తి అనారోగ్యంతో చికిత్స నిమిత్తం చేరాడు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 7గంటలకు మృతి చెందగా కుటుంబ సభ్యుల కోసం ఆస్పత్రి వర్గాలు ఎదురు చూశారు. ఎవరు రాకపోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం గదిలో భద్రపరిచారు. ఆస్పత్రి ఆర్ఎంఓ హర్షవర్ధన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

డోర్నకల్: మహబూబాబాద్, గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్య సోమవారం రైలు పట్టాల వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. అప్‌లైనులో తాటియాతండా రైల్వే గేటు సమీపంలో కిలోమీటర్ నంబర్ 443/4–6 వద్ద సుమారు 35 సంవత్సరాల పురుషుడి మృతదేహాన్ని గుర్తుంచిన రైల్వే సిబ్బందితో పాటు స్థానికులు జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు రైలు నుండి జారిపడి మృతి చెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్అండ్‌బీ ద్వారా రోడ్డు నిర్మించాలి

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని దాశరథి సెంటర్ నుంచి ఎస్సీ కాలనీ వరకు గల రోడ్డును ఆర్అండ్‌బీ ద్వారానే రోడ్డు నిర్మాణం చేపట్టాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు గుగులోతు లక్ష్మణ్ నాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ... దాశరథి సెంటర్ నుంచి ఎస్సీ కాలనీ వరకు 18 ఫీట్లతో ఆర్అండ్‌బీ ద్వారానే రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈవిషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

జీఓ ప్రకారం వేతనాలు చెల్లించాలి

గార్ల: గార్లలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీవేజ్ కార్మికులు సోమవారం విధులు బహిష్కరించి పాఠశాల ఎదుట సమ్మె చేపట్టారు. ఈసమ్మె శిబిరాన్ని సీఐటీయూ మండల కన్వీనర్ కందునూరి శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి అలువాల సత్యవతి సందర్శించి మాట్లాడారు. వర్కర్స్‌కు జీఓ నంబర్ 64 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు వీరన్న, సత్యం, నరసింహారావు, బాబూరావు, సీతారాములు, వెంకన్న, శోభారాణి పాల్గొన్నారు.

నేడు ఏఐకేఎస్ జిల్లా మహాసభ

బయ్యారం: సీపీఐ అనుబంధ ఏఐకేఎస్ జిల్లా 3వ మహాసభను మంగళవారం బయ్యారంలో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి విజయ్‌సారథి తెలిపారు. మహాసభ వేదికను సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాస్, కళింగరెడ్డి, పద్మ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



గార్ల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను పోలీసులు గుర్తించి, సోమవారం బాధితుడికి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను అప్పగించాడు. గార్లకు చెందిన గుగులోత్ బుజ్జి గత జనవరి 21న సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐఈఆర్ యాప్ ద్వారా గుర్తించి, బాధితురాలికి అందజేసినట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా తెలిపారు.

ఎమ్మార్పీఎస్ దీక్ష

మరిపెడ: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు తెలంగాణ అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవి ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహం ఎదుట దీక్ష చేపట్టారు.

ఉద్యోగ భర్తీలను నిలిపివేయాలి

మరిపెడ: ఉద్యోగ భర్తీలను వెంటనే నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవీందర్ అన్నారు. ఈమేరకు మరిపెడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో మంద వెంకన్న, మండల అధ్యక్షుడు ఐనాల వెంకన్న, బాసింపగు వీరబాబు, ఎడెల్లి వెంకటేష్, రంగన్న, వెంకన్న పాల్గొన్నారు.

హస్తకళా నైపుణ్యంతో భవిష్యత్‌కు భరోసా

దంతాలపల్లి: హస్తకళల్లో నైపుణ్యం సాధించిన వారికి భవిష్యత్‌లో ఆర్థికభరోసా ఉంటుందని హెచ్ఎం కృష్ణయ్య అన్నారు. మండలంలోని దాట్ల గ్రామ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు తయారు చేసిన హస్తకళ వస్తువులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, విజయ్‌కుమార్, స్వప్న, రమేష్, ప్రేమ్‌కుమార్, రామయ్య పాల్గొన్నారు.

ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలి

గూడూరు: ప్రభుత్వం భవన నిర్మాణ అర్హులందరికీ ఉచితంగా ఇసుక రవాణా చేయాలని మండల తాపీ వర్కర్ల సంఘం అధ్యక్షుడు చెల్వూరు శ్రీశైలం డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని సంఘం కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 20న జిల్లా తాపీ మేస్త్రీల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంకూస్, వెంకన్న, లక్ష్మి నారాయణ, యాకూబ్, ఉపేందర్ పాల్గొన్నారు.

మిర్చికి మద్దతు ధర కల్పించాలి

మరిపెడ: మిర్చికి క్వింటాకు రూ.28వేలు కనీస మద్దతు ధర చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. సోమవారం మరిపెడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు అబ్దుల్ రషీద్, అంజి, నారాయణ, భద్రు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

మహబూబాబాద్: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మున్సిపాలిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు మార్నెని కిరణ్ డిమాండ్ చేశాడు. అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సుమారు రూ.50కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మణరావు, మార్నెని రఘు, సుధాకర్, ఉప్పలయ్య, ఉపేందర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మొక్కజొన్న చేను దగ్ధం

ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని రెండు ఎకరాల మొక్కజొన్న చేను దగ్ధమైన సంఘటన మండలంలోని పోలారం గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. బాధితుడు జోగ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించి రెండు ఎకరాల మొక్కజొన్న అగ్నికి ఆహుతి అయిందని బాధితుడు కన్నీరు పెట్టుకున్నారు. సుమారు లక్షా యాభై వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

తాత్కాలిక జీపీ భవనం ప్రారంభం

దంతాలపల్లి: మండలకేంద్రంలో ఎంపీడీఓ వివేక్ రామ్, తహసీల్దారు రాజేశ్వర్‌తో కలిసి సోమవారం తాత్కాలిక గ్రామపంచాయతీ భవనం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ వాహిని, ఎంపీఓ అప్సర్‌పాషా, ఆర్ఐ నజీముద్దీన్, కార్యదర్శి వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ చేసిన డబ్బులు ఇవ్వాలి

మహబూబాబాద్: కులగణన సర్వేలో భాగంగా ధ్రువపత్రాలను ఆన్‌లైన్ చేశామని, వాటి డబ్బులు ఇవ్వాలని డేటా ఎంట్రీ ఆపరేటర్ వికాస్ డిమాండ్ చేశాడు. కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆందోళన చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

గూడూరు: గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొట్టిన ప్రమాదంలో వరంగల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ నిరుపేద వ్యక్తి సోమవారం మృతిచెందిన సంఘటన సోమవారం పలువురిని కంటతడి పెట్టించింది. వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఇండ్ల రమేష్ (40)అనే వ్యక్తి గతనెల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. వెంటనే రమేష్‌ను 108 అంబులెన్స్ ద్వారా గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వరంగల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రమేష్ అర ఎకరం పొలం విక్రయించి, రూ.15లక్షలతో నెలకుపైగా చికిత్స కోసం ఖర్చు చేశాడు. మృతుడికి భార్య సులోచన, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు నాయకులు కోరుతున్నారు.

‘అభివృద్ధికి నిధులు కేటాయించండి’



తొర్రూరు: తొర్రూరు మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.50కోట్ల నిధులు కేటాయించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నరసింహరెడ్డిని ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతిపత్రం సమర్పించారు. మున్సిపాలిటీలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, మంచినీటి సరఫరా, స్మార్ట్ లైటింగ్ వంటి సదుపాయాల విస్తరణ నిమిత్తం నిధుల అవసరం ఉందని చైర్మన్‌కు ఎమ్మెల్యే వివరించారు. మున్సిపాలిటీల అభివృద్ధికి నిధుల కేటాయింపు కోసం చర్యలు తీసుకుంటానని చైర్మన్ నరసింహరెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

స్నాప్‌చాట్‌లో పరిచయం

యువతి చేతిలో రూ.3.37లక్షలు మోసపోయిన యువకుడు

గార్ల: స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన యువతి మాటలకు ఆకర్షితుడైన ఓ యువకుడు రూ.3,37,000 పోగొట్టుకున్న ఘటన గార్లలో జరిగింది. ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా కథనం ప్రకారం.. గార్ల మండలంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న గాడిపల్లి అజయ్‌కి గత జనవరి 22న స్నాప్‌చాట్ ద్వారా స్పందన అనే యువతి పరిచమైంది. తాను గుంటూరులో చదువుకుంటున్నానని యువకుడికి తెలిపింది. జనవరి 29న ఇంటి కిరాయి చెల్లించడానికి రూ.400తక్కువగా ఉన్నాయని స్పందన చెప్పడంతో అజయ్ ఫోన్‌పే చేశాడు. అలాగే తన తమ్ముడు శివ అకౌంట్‌లో మినిమం బ్యాలెన్స్ లేదని రూ.2000 ఫోన్ పే చేయించుకుంది. ఇలా ఇప్పటివరకు వారి రెండు అకౌంట్లకు పలు దఫాలుగా మొత్తం రూ.3,37,000ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఈ క్రమంలో యువకుడు పలుమార్లు యువతికి ఫోన్ చేసినా స్విచ్ఆఫ్ వచ్చింది. కాగా తాను మోసపోయానని తెలుసుకున్న బాధితుడు అజయ్ సైబర్‌క్రైమ్ నంబర్ 1930కు ఫోన్ చేయగా, వారి సూచన మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.